

నేడు రంజాన్

ఆకాశంలో నెలవంక దర్శనం.. ఈద్-ఉల్-ఫితర్‌కు సిద్ధమైన ముస్లింలు.. ముస్తాబైన ఈద్గాలు, మసీదులు




విద్యుద్దీపాల అలంకరణలో గుల్జార్‌పేట మసీదు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 10: ముస్లింల నెలరోజుల ఉపవాస దీక్షలు బుధవారంతో పూర్తయ్యాయి. ఆకాశంలో నెలవంక దర్శనమివ్వడంతో గురువారం రంజాన్ పండుగను నిర్వహించుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల రోజులు నిత్యం దైవ చింతనలో గడిపారు. పేదలకు తోచినంత దానం చేశారు. తోటివారితో సంధ్యవేశలో ఇఫ్తార్ విందును ఆరగించారు. మసీదుల్లో ప్రార్థనలను నిర్వహించుకున్నారు. వేడుకలలో చివరి ఘట్టం.. ఈద్-ఉల్-ఫితర్ వచ్చేసింది. మసీదుల్లో బుధవారం సాయంత్రం సెహరి ప్రార్థనలు ముగిసిన అనంతరం ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు.

ఈద్గా మైదానంలో ఏర్పాట్లు

రంజాన్ ప్రత్యేక ప్రార్థనల కోసం జిల్లా కేంద్రంలోని డ్రైవర్స్ కాలనీ ఈద్గా మైదానాన్ని సిద్ధం చేశారు. ఈ మైదానంలో పెద్దసంఖ్యలో ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొంటుంటారు. నగర పాలిక సిబ్బంది ఈద్గా బుధవారం సాయంత్రం మైదానానికి చేరుకుని షామియానాలు ఏర్పాటు చేశారు. వజూ కోసం నీటి వసతిని కల్పించారు. ప్రార్థనలకు హాజరయ్యే ముస్లింల కోసం మైదానానికి రెండు ద్వారాలను ఏర్పాటు చేశారు.



రహమత్‌నగర్ బ్రిడ్జి వద్ద అలంకరణలో బాబానగర్ మసీదు

నెలరోజుల దీక్షకు సార్థకత..

నెలరోజుల కఠిన ఉపవాస దీక్షకు ఈద్-ఉల్-ఫితర్‌తో సార్థకత చేకూరనుంది. ఈ రోజున చేసే ప్రార్థనలకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. ఉపవాసాలతో శరీరాన్ని, మనసును పవిత్రం చేసుకుని, ఆధ్యాత్మిక భావజాలంతో సాగే అతిపెద్ద పండుగ రంజాన్. ఈ పర్వదినాన్ని నగర మహమ్మదీయ సోదర సోదరీమణులంతా సంతోషంగా జరుపుకోవాలి. అన్ని మతాలవారి మధ్య సయోధ్య, ఐక్యత, సోదరభావాన్ని ప్రసాదించాలని రంజాన్ సందర్భంగా అల్లాహ్‌ను ప్రార్థిస్తున్నాను.



- కేయం షకీల్ షఫి, ముతవళ్లుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

టీడీపీలో జోరు... వైసీపీలో బేజారు

జగన్ పాలనపై పెల్లుబుకుతున్న అసంతృప్తి

- ఒక్కొక్కరుగా పార్టీని వీడి టీడీపీలోకి చేరిక
- నామినేషన్లు మొదలైతే మరిన్ని చేరికలు
- అన్ని వర్గాల ప్రజలు కూటమివైపే
- వైసీపీ అభ్యర్థుల్లో ఆందోళన...

(ఆంధ్రజ్యోతి, అనంతపురం)

జిల్లాలో అధికార వైసీపీకి వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల నుంచే ఆ పార్టీ నుంచి వలసలు అధికమయ్యాయి. దీంతో వైసీపీ అభ్యర్థులు బేజారవుతున్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో న్యాయం జరగక పోవడంతోనే వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు ఉండటానికి ప్రధాన కారణమన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోనూ పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి, టీడీపీలో చేరిపోతున్నారు. వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనకు చరమగీతం పాడి కూటమి అభ్యర్థులను బలపరచాలనే ఏకైక అజెండాతో వైసీపీని వీడుతున్నారనే భావన ఆ పార్టీ వర్గాల నుంచే వ్యక్తమవుతుండటం గమనార్హం. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైతే అధికార వైసీపీ నుంచి వలసలు మరింత పెరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు.

టీడీపీలోకి చేరికలే చేరికలు



గత సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి కృషి చేసిన ఆ పార్టీ ముఖ్య నాయకుల దగ్గర నుంచి సామాన్య కార్యకర్తల వరకు వైసీపీని వీడుతున్నారు. ముఖ్యంగా రాప్తాడు నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యేతో పాటు ఆయన కుటుంబసభ్యుల ఒంటెత్తు పోకడలు, నియంతృత్వ ధోరణితో వైసీపీ సామాజికవర్గ నాయకులే విసిగిపోయారు. ఈ నేపథ్యంలోనే ఆ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి పరిటాల సునీత ఆధ్వర్యంలో టీడీపీలో చేరుతున్నారు. ఇప్పటికే వైసీపీలో కీలకంగా వ్యవహరించిన సాయినాథ్‌రెడ్డి, పుల్లారెడ్డి, మోహన్‌రెడ్డి, పక్కీరా రెడ్డి, మాధవరెడ్డి, వెంకటరెడ్డిలతో పాటు వందలాది మంది ఆ పార్టీ కార్యకర్తలు పసుపు కండువా కప్పుకున్నారు. అతి త్వరలో కొందరు సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆ పార్టీ వర్గాల ద్వారా అందిన సమాచారం. రాయదుర్గం నియోజకవర్గంలోనూ వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు కొనసాగాయి. వైసీపీలోని ముఖ్య నాయకులు డాక్టర్ నీలకంఠారెడ్డి, కౌన్సిలర్ పద్మజ, సర్పంచ్ దోనప్పలతో పాటు పలువురు బీసీ సామాజికవర్గం నాయకులు ఇప్పటికే పార్టీలో చేరారు. అంతేకాకుండా పలువురు ఎంపీటీసీలతో పాటు మాజీ సర్పంచ్‌లు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ప్రధానంగా వైసీపీలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నుంచే అత్యధికంగా టీడీపీలోకి చేరికలున్నాయి. తాడిపత్రి నియోజకవర్గంలోనూ వైసీపీ నాయకులు భారీగా టీడీపీలో చేరిపోతు న్నారు. ఇప్పటికే ఆ పార్టీలో బలమైన నాయకులుగా కొనసాగుతున్న కాకర్ల రంగనాథ్, జగదీశ్వర్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ రంగారెడ్డి పార్టీలోకి చేరారు. తాజాగా చంద్రబాబు సమక్షంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు వీఆర్ రామిరెడ్డి కుమారులు వెంకటేశ్వర రెడ్డి, విఘ్నేశ్వరరెడ్డి పసుపు కండువా వేసుకున్నారు. కార్యకర్తలు వందలాదిగా చేరిపోతున్నారు. కళ్యాణదుర్గంలో కౌన్సిలర్లు అబ్రహం, అనసూయమ్మ ఇటీవలే వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఇక గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు వందలాది మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఉరవకొండ, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లోనూ వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున టీడీపీలోకి చేరుతున్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోనూ వైసీపీ నుంచి వలసలు భారీగా జరుగుతున్నాయి. ఇప్పటికే ఆ పార్టీకి చెందిన ఓ కార్పొరేటర్, మరో స్వతంత్ర కార్పొరేటర్‌తో పాటు కొందరు ముఖ్య నాయకులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. త్వరలో మరికొంత మంది కార్పొరేటర్లు వైసీపీని వీడేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబానికి ఆది నుంచి అత్యంత సన్నిహితంగా మెలుగుతున్న ఓ కుటుంబానికి చెందిన నాయకులు వైసీపీని వీడే యోచనలో ఉన్నట్లు సమాచారం.

కట్టడి చేయలేక.. వైసీపీ ముఖ్యుల నిస్సహాయత...




జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయిలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా టీడీపీలోకి చేరుతున్నారు. అయితే వారి చేరికలను నిలువరించేందుకు అధికార పార్టీ ముఖ్య నాయకులు చేస్తున్న ప్రయత్నాలు ఏ మాత్రం ఫలించకపోవడంతో చేతులెత్తేస్తున్న పరిస్థితి ఆయా నియోజకవర్గాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. సర్వేలన్నీ కూటమిదే అధికారమని స్పష్టం చేస్తున్న నేపథ్యానికి తోడు... గత సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని అధికారంలోకి తీసుకురావడానికి పనిచేసిన వ్యూహకర్త ప్రశాంత కిశోర్ సైతం తాజాగా జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ మరోమారు అధికారంలోకి రాలేదన్న స్పష్టమైన సంకేతాలిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలకు ప్రధాన కారణమని తెలుస్తోంది. ఇవన్నీ ఒక ఎత్తయితే... వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జిల్లాలో ఇటీవల చేపట్టిన బస్సు యాత్రలో ఒక్కమాట కూడా మాట్లాడకుండా కేవలం రోడ్ షోల్లో అభివాదంతోనే సరిపెట్టడం ఆ పార్టీ వర్గాలను మరింత అసంతృప్తికి లోను చేసింది. పార్టీ అభ్యర్థులను గెలిపించాలని సీఎం జగన్ ప్రజలకు విజ్ఞప్తి చేయలేదన్న అసంతృప్తి ఆ పార్టీ అభ్యర్థుల్లోనూ నెలకొంది.

అందరి నోట కూటమి మాటే...

ఐదేళ్ల జగన్ పాలనలో అరాచకం రాజ్యమేలింది. అక్రమార్కులు చెలరేగిపోయారు. భూకబ్జాలు పెరిగిపోయాయి. బటన్ నొక్కుడుతో కొందరికి అరకొర ప్రయోజనాలు తప్ప... అభివృద్ధి లేదన్నది అందరి నోటా వినిపించే మాట. జిల్లా అభివృద్ధికి ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా... కరువు జిల్లా యువతకు ఉపాధి అవకాశాల కోసం పరిశ్రమలు తీసుకురాలేదు. దీంతో వైసీపీ ప్రభుత్వంపై యువత నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఉద్యోగవర్గాలు, కార్మికులదీ అదే పరిస్థితి. కరువు రైతును ఆదుకుంటామన్న మాటలు కోటలు దాటాయి తప్పా... ఆ వర్గాలకు మేలు చేసిన పరిస్థితే లేదు. నా ఎస్సీ... నా బీసీ... నా ఎస్టీ... నా మైనార్టీ అని ఒట్టి ప్రేమ ఒలకబోయడం తప్పా వారికి ప్రత్యేకంగా చేసింది ఏమి లేదు. గత ప్రభుత్వంలో ఆ వర్గాల కోసం అమలు చేసిన పథకాలను కూడా రద్దు చేశారు. సబ్‌ప్లాన్ నిధులను మంజూరు చేయకుండా ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి మోకాలడ్డింది వైసీపీ ప్రభుత్వమే. ఆ వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఏర్పాటు చేసిన కార్పొరేషన్లకు నిధులివ్వలేదు. దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలన్నీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో అసంతృప్తిని వెల్లగక్కుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఆ మేరకు ప్రభావం చూపాలనే యోచనలో ఆ వర్గాలు ఉన్నాయి. అందుకే ఇప్పుడు అందరి నోట కూటమి మాటే వినిపిస్తోంది.

అంతా ఓకేనా..?

- క్లెయిమ్‌ల పరిష్కారంపై అనుమానాలు
- జిల్లాలో ఫారం-6 దరఖాస్తులు 54,036
- తిరస్కరించినవి 13,656..
- రాప్తాడులోనే 4,484
- ఫారం-7 దరఖాస్తుల్లో నాలుగు మాత్రమే పెండింగ్



వైష్ణవి పది మార్కుల జాబితా, ఓటరు జాబితాలో నమోదైన ఎన్‌డీఎఫ్ నంబరు

ఓటరు జాబితాలో అనర్హులు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 10: ఓటరు జాబితాపై విపక్షాలలో ఇంకా అనుమానాలు తొలగలేదు. నకిలీ ఓటర్లు, డబుల్, ట్రిపుల్ ఓటర్లు, మైనర్ ఓటర్లు.. ఇలా అనేకం ఇంకా ఓటరు జాబితాలో ఉన్నాయని సందేహిస్తున్నారు. దీనికితోడు విపక్ష సానుభూతిపరుల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు భారీ స్థాయిలో కుట్రలు జరిగాయి. వీటిపైనా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. అక్రమాలు నిజమేనని నిర్ధారిస్తూ.. చాలామంది అధికారులపై చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ గౌతమి బదిలీకి కారణాల్లో ఇదీ ప్రధాన అంశమే అన్న ప్రచారం జరుగుతోంది. ఫారం-6, ఫారం-7 క్లెయిమ్‌ల పరిష్కారం తీరుపై విపక్షాలు అనేక అనుమానాలను వ్యక్తం చేస్తున్నాయి. వైసీపీకి అనుకూలంగా ఓటరు జాబితాలో నకిలీలను, అనర్హులను చేర్పించారని, ఒక్కరి పేరిట రెండుమూడు ఓట్లు కల్పించరాని, అవి ఇప్పటికీ జాబితాలో అలాగే ఉన్నాయని ఆరోపిస్తున్నారు.

నియోజకవర్గం	ఫారం-6	తిరస్కరణ	ఆమోదం	పెండింగ్
రాయదుర్గం	5570	1155	3817	598
ఉరవకొండ	5997	1865	3599	598
గుంతకల్లు	6291	1744	3847	700
తాడిపత్రి	7556	1394	5604	558
శింగనమల	6037	899	4541	597
అనంతపురం	7817	1834	5176	807
కళ్యాణదుర్గం	5742	811	4478	453
రాప్తాడు	9026	3954	4542	530

నియోజకవర్గం	ఫారం-7	తిరస్కరణ	ఆమోదం	పెండింగ్
రాయదుర్గం	2800	398	2400	00
ఉరవకొండ	5713	610	5103	00
గుంతకల్లు	5360	591	4769	00
తాడిపత్రి	5227	590	4633	01
శింగనమల	5810	328	5478	00
అనంతపురం	9784	998	8773	02
కళ్యాణదుర్గం	5425	1807	3617	01
రాప్తాడు	5325	1988	3327	00

కత్తిమీద సాము..

జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలలో ఫారం-6, 7, 8 క్లెయిమ్‌లు అధికారులకు 1,38,514 అందాయి. అధికార పార్టీవారి జోక్యం కారణంగా వీటి పరిష్కారం అధికారులకు కత్తి మీద సాములా మారుతూ వచ్చింది. ఫిర్యాదుల పరిష్కారంపై దీని ప్రభావం పడింది. దీంతో డబుల్, ట్రిపుల్ ఓట్లలో కొన్నింటిని తొలగించకుండానే వదిలేశారని టీడీపీ ఆరోపించింది. క్లెయిమ్‌ల పరిష్కారం, తిరస్కరణ, పెండింగ్ వివరాల గణాంకాలు కూడా అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. జిల్లాలో అన్ని క్లెయిమ్‌లు కలిపి 1,38,514 వచ్చాయి. ఇందులో 24,710 క్లెయిమ్‌లను తిరస్కరిచారు. 1,09,003 క్లెయిమ్‌లను ఆమోదించారు. ఇందులో 1,04,223 క్లెయిమ్‌లను పరిశీలించి పరిష్కరించారు. అన్ని రకాల క్లెయిమ్‌లు కలిపి 4,780 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు చూపుతున్నారు. ఇందులో సింహభాగం.. కొత్త ఓటర్ల దరఖాస్తులు(ఫారం-6) 4,776 ఉన్నాయి. ఫారం-7 క్లెయిమ్స్ కేవలం నాలుగు పెండింగ్ ఉన్నాయి. తిరష్కరించిన క్లెయిమ్స్ వేలాదిగా ఉన్నాయి. అధికారిక లెక్కల ప్రకారం అన్ని రకాల క్లెయిమ్‌లు కలిపి తిరస్కరించినవి ఏకంగా 24,710.



బాల ఓటర్లు..

కొత్త ఓటర్లు ఫారం-6 దరకాస్తులను ఉపయోగిస్తారు. 18 ఏళ్ల వయసు నిండినవారు ఓటు హక్కు పొందేందుకు ఈ దరఖాస్తులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌ద్వారా అందజేస్తారు. జిల్లాలోని ఎనిమిది నియోజవర్గాల నుంచి 54,036 మంది ఫారం-6 దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 13,656 దరఖాస్తులను తిరస్కరించారు. రాప్తాడు నియోజకవర్గంలో 9,026 మంది కొత్తగా ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోగా.. అత్యధికంగా 3,954 దరఖాస్తులను తిరస్కరించారు. ఇక్కడ మైనర్ల చేత కూడా అధికారపార్టీవారు దరఖాస్తు చేయించారని ఆరోపనలు ఉన్నాయి. ఆధార్ కార్డులో వయసు పెంచి.. ఫారం-6 దరఖాస్తు చేయించారని ప్రచారం జరుగుతోంది, అనంతపురం రూరల్ మండలం క్రిష్ణంరెడ్డిపల్లిలో బాలల పేర్లను ఓటరు జాబితాలో చేర్చిన విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. రాప్తాడు నియోజకవర్గంలో అధికారులు తిరస్కరించిన ఫారం-6 దరఖాస్తులు భారీగా ఉండటం చూస్తే.. బోగస్ ఓట్లను చేర్పించేందుకు పెద్ద కుట్ర జరిగినట్లు స్పష్టమౌతోంది.

ఫారం-7 దుర్వినియోగం

ఓటరు జాబితా నుంచి విపక్ష సానుభూతిపరులను తొలగించేందుకు అధికార పార్టీ నాయకలులు ఫారం-7ను విచ్చలవిడిగా ఉపయోగించారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు అనేక ఫిర్యాదులు వెళ్లాయి. జిల్లా వ్యాప్తంగా ఫారం-7 క్లెయిమ్‌లు 45,444 అందాయి. వీటిలో 7,320 క్లెయిమ్‌లను తిరస్కరించారు. 38,100 క్లెయిమ్‌లను ఆమోదించారు. వీటన్నింటిని పరిశీలించి, 38,096 క్లెయిమ్‌లను పరిష్కరించామని, నాలుగు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు అంటున్నారు. అనంతపురం అర్బన్‌లో 02, తాడిపత్రి, కల్యాణదుర్గం నియోజకవర్గాలలో ఒక్కొక్కటి పెండింగ్ ఉన్నాయని రికార్డులలో చూపించారు. ఈ ప్రక్రియ దాదాపు పూర్తి అయినా, విపక్షాలలో అనుమానాలు తొలగలేదు. త్వరలో జిల్లాకు వస్తున్న కేంద్ర ఎన్నికల పరిశీలకులకు ఆధారాలతో బోగస్ ఓటర్ల గురించి ఫిర్యాదు చేసేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సిద్ధమవుతున్నారు. అక్రమాలు తేలితే.. బాధ్యులపై అధికారులపై చర్యలు తప్పవు.



మురళి మార్కుల జాబితా, ఓటరు జాబితాలో నమోదైన ఎన్‌డీఎఫ్ నంబరు

దర్యాప్తు ముమ్మరం

- రంగంలోకి జడ్పీ సీఈఓ
- విద్యాశాఖ విచారణ తూతూమంత్రం
- మాస్టార్ల డిన్నర్‌పై కొనసాగుతున్న చర్చ

అనంతపురం విద్య, ఏప్రిల్ 10: ఉపాధ్యాయుల డిన్నర్‌పై దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. ఐఏఎస్ అధికారి, జడ్పీ సీఈఓ మైకోమ్ నిదియా ఈ వ్యవహారంపై లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఎన్నికోడ్ అమల్లో ఉందని తెలిసీ.. వైసీపీ అనుబంధ ఉపాధ్యాయ సంఘం, మరో ఉపాధ్యాయ సంఘం నాయకులు ఏర్పాటు చేసిన విందుకు పలువురు ఉపాధ్యాయులు, సమగ్రశిక్ష ఉద్యోగులు, ప్రధానోపాధ్యాయులు, పీడీలు హాజరయ్యారు. నగర శివారులోని బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన.. నేషనల్ పార్క్ సమీపంలోని ఓ డాబాలో గత నెల 31న రాజకీయ విందు ఇచ్చారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ విందుకు భారీ ఎత్తున ఉపాధ్యాయులు, ఎస్ఎస్ఏ సిబ్బంది హాజరయ్యారు. ఈ క్రమంలో పలువురు మద్యం సేవించి, చిందులు వేశారని సమాచారం. విందు చివరలో వైసీపీ ఎమ్మెల్యే అక్కడికి వెళ్లడం, తమ పార్టీకి అండగా నిలవాలని కోరడంతో దుమారం రేగింది. దీనిపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో విద్యాశాఖ, సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారులు, పోలీసులు విచారణ చేపట్టారు. విద్యాశాఖ అధికారులు తూతూ మంత్రంగా విచారణ చేశారని ఆరోపణలు వస్తున్నాయి. కొందరు ఉపాధ్యాయులు, నాయకులు, సమగ్రశిక్ష ఉద్యోగులతో విందుకు వెళ్లలేదన్నట్టుగా నామమాత్రంగా రాయించుకుని వదిలేసినట్లు సమాచారం. దీంతో జడ్పీ సీఈఓ తనదైన శైలిలో విచారణకు సిద్ధమైనట్లు సమాచారం. జడ్పీ ఉద్యోగుల ద్వారా విచారణ చేయించేందుకు ఆమె పూనుకున్నారని తెలుస్తోంది. మాస్టార్ల డిన్నర్ ఎక్కడ జరిగింది...? ఎలా జరిగింది...? ఎంత మంది పాల్గొన్నారు...? అధికారులు ఇచ్చిన రిపోర్టులు ఎంత వరకు వాస్తవం అన్న కోణాల్లో దర్యాప్తు జరపాలని జడ్పీ ఉద్యోగులను ఆదేశించినట్లు తెలుస్తోంది. దీంతో కొందరు జడ్పీ ఉద్యోగులు బుధవారం ఆ డాబా వద్దకు వెళ్లి విచారించారని తెలుస్తోంది. లోతైన దర్యాప్తు చేయించేందుకు జడ్పీ సీఈఓ రెడీ అయ్యారు. విందు జరిగిన రోజు స్పాట్‌లో ఉన్న సిగ్నల్స్ ఆధారంగా, డాబా వద్ద, సమీప ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా వివరాలు రాబట్టేందుకు చూస్తున్నారు.





బండి రవి గూండాగిరి

మళ్లీ రెచ్చిపోయిన వైసీపీ రౌడీ

కోనాపురంలో టీడీపీ కార్యకర్తలపై రాళ్లదాడి

- తీవ్రంగా గాయపడిన శివలింగ, శివయాదవ్
- సిద్ధం సభలో ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై హత్యాయత్నం
- అయినా అరెస్టు చేయని పోలీసులు..
- సొంతూరిలో అరాచకం (మెయిన్‌లో)



బండి రవి





బండిరవి దాడిలో తీవ్రంగా గాయపడిన టీడీపీ కార్యకర్తలు

ఎంత బంగారమో..!

అనంతపురం క్రైం, ఏప్రిల్ 10: అనంతపురం నగరంలో ఈ నెల 8వ తేదీన పోలీసులకు భారీ ఎత్తున బంగారం పట్టుబడింది. ఏకంగా రూ.25 కోట్ల విలువైన 30 కిలోల బంగారు ఆభరణాలను పోలీసులు పట్టుబడ్డాయి. వాటికి సంబంధించిన బిల్లులు ఉన్నా.. స్పష్టత లేకపోవడంతో ఆభరణాలను రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈ నెల 8వతేదీ రామ్‌నగర్‌లో ఫోర్త్ టౌన్ పోలీసుల తనిఖీలు చేపట్టారు. ఓ వాహనంలో భారీగా బంగారు ఆభరణాలు లభించాయి. దీంతో కలెక్టర్, ఎస్పీకి సమాచారం అందించారు. అనంతరం పన్నుల శాఖ అధికారులకు బిల్లుల బాధ్యత అప్పగించారు. జిల్లాలోని వివిధ బంగారు దుకాణాలకు సరఫరా చేసేందుకు విజయవాడ నుంచి ఆభరణాలను తీసుకువస్తున్నట్లు తెలిసింది. రాజకీయ పార్టీలకు సంబంధించినది కాకపోవడంతో అధికారులు ఈ విషయంలో గోప్యత పాటించారని తెలిసింది. పట్టుబడిన మొత్తం బంగారాన్ని పన్నుల శాఖ అనంతపురం సర్కిల్-1 అధికారులు పర్యవేక్షిస్తున్నారట. జీఎస్టీ ఎగ్గొట్టి బంగారాన్ని తరలించబోయినట్లు తెలిసింది. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే. పన్ను చెల్లించకుండా బంగారాన్ని విడిపించుకు వెళ్లేందుకు కొందరు తెరవెనుక ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. పద్ధతిగా బయటకు రావాలంటే పన్నుల శాఖకు రూ.45 లక్షల దాకా చెల్లించాల్సి రావచ్చని తెలిసింది. అదే రోజు రాత్రి వన్‌టౌన్ పోలీసుల తనిఖీలో ఓ వ్యక్తి నుంచి రూ.14 లక్షల నగదు, రూ.1.75 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాటికి సంబంధించిన బిల్లులు లేవని తెలిసింది.



పట్టుబడినా.. బయట పెట్టలేదు

నామినేషన్లకు ఏర్పాట్లు చేయండి

అధికారులకు కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టరు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 10: నామినేషన్ల ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ అమిత్‌బర్దర్‌తో ఆయన నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 18న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి ఆ రోజు నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఏర్పాట్లు చేయాలన్నారు. అనంత పార్లమెంటు నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్ ఉంటారని, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా పౌరసరఫరాల శాఖ డీఎం రమేష్‌రెడ్డి ఉంటారన్నారు. అభ్యర్థులు నామినేషన్ వేసిన రోజునే స్ర్కూట్నీ చేసి వివరాలు తప్పుగా ఉంటే వెంటనే ఆయా అభ్యర్థులకు తెలపాలన్నారు. ఈ ప్రక్రియ కోసం కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, కలెక్టరేట్ ఏఓ అంజన్‌బాబు పాల్గొన్నారు.

ఎప్పుడూ అందుబాటులో ఉంటాం

సమస్యలను మా దృష్టికి తీసుకురండి

రాజకీయపార్టీల సమావేశంలో కలెక్టరు, ఎస్పీ

అనంతపురం టౌన్, ఏప్రిల్ 10: ఎప్పుడూ అందుబాటులో ఉంటామని, ఎన్నికలకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్దర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపుపొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తనతోపాటు ఎస్పీ అందుబాటులో ఉంటారని, సమస్యలను వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కొత్త ఓటరు నమోదుకు ఈనెల 14 వరకు అవకాశం ఉందన్నారు. రాజకీయపార్టీలు అనుమతుల కోసం సువిధ, ఎన్కోర్‌యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఆలస్యం లేకుండా అనుమతులు మంజూరు చేస్తామన్నారు. 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, నడవలేని దివ్యాంగులకు హోం ఓటింగ్ సౌకర్యం ఉందన్నారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ నిబద్ధతతో పనిచేస్తుందన్నారు. ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. రాప్తాడు, తాడిపత్రి, ఉరవకొండ నియోజకవర్గాల్లో ప్రత్యేక పోలీస్ బందోబస్తు కొనసాగిస్తామని తెలిపారు.

13న కదిరిలో బాలకృష్ణ పర్యటన



మాట్లాడుతున్న కందికుంట, బీవీ

కదిరి, ఏప్రిల్ 10: సైకిల్ రావాలి యాత్రంలో భాగంగా హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ ఈనెల 13న కదిరిలో పర్యటించనున్నట్లు కదిరి కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీవీ వెంకటరాముడు తెలిపారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. నందమూరి బాలకృష్ణ సైకిల్ రావాలి.. యాత్రలో భాగంగా కదిరికి ఉదయం చేరుకుంటారన్నారు. లక్ష్మీనరసింహస్వామి ఆయలంలో పూజలు చేస్తారన్నారు. అనంతరం పీవీఆర్ గ్రాండ్‌లో విశ్రాంతి తీసుకుని, మధ్యాహ్నం 3గంటలకు ఫంక్షన్ హాల్‌లో గిరిజనులతో సమావేశం అవుతారన్నారు. అక్కడనుంచి ర్యాలీగా స్థానిక జీవిమాన్ సర్కిల్ చేరుకుని ప్రజలనుద్దేశించి మాట్లాడతారన్నారు. కార్యక్రమాన్ని టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నీకు నేనున్నా.. పార్టీకి పనిచెయ్..

నిమ్మలకు చంద్రబాబు భరోసా



చంద్రబాబుతో నిమ్మల కిష్టప్ప, తనయుడు అంబరీష్

హిందూపురం, ఏప్రిల్ 10: 'నీకు నేనున్నాను. పార్టీ విజయానికి కృషి చేయి.' అంటూ మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్పకు టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. జరుగబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు నిమ్మల కిష్టప్పకు అవకాశం లేకపోవడంతో కొద్ది రోజులుగా ఆయన సైలెంట్‌గా ఉన్నారు. ఈక్రమంలో మంగళవారం జిల్లాకు చెందిన ఇద్దరు అధికార పార్టీ ఎమ్మెల్యేలు నిమ్మల కిష్టప్పను కలిశారు. ఈ విషయం అధిష్ఠానానికి చేరడంతో నిమ్మలను బుధవారం చంద్రబాబు హైదరాబాదులోని తన స్వగృహానికి పిలిపించుకున్నారు. సుమారు 20 నిమిషాల పాటు నిమ్మల చంద్రబాబుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ... పార్టీ ఆవిర్భావం నుంచి తాను పని చేస్తున్నానని, ఈసారి ఎన్నికల్లో తనకు అవకాశం ఇవ్వలేదని చంద్రబాబుతో తెలిపారు. ముఖ్యంగా తమ సామాజికవర్గానికి మరో సీటు వస్తుందని ఆశించినా, రాకపోవడం కొంత బాధ కలిగించిందన్నారు. దీనిపై చంద్రబాబు మాట్లాడుతూ గతంలో మంత్రి పదవి, ఎంపీగా అవకాశం ఇచ్చామని, ప్రస్తుత రాజకీయ సమీకరణల నేపథ్యంలో అవకాశం లేదన్నారు. అయితే పార్టీ విజయానికి కృషి చేయమని, తమ రాజకీయ భవిష్యత్తు తాను చూసుకుంటానని చంద్రబాబు హామీ ఇచ్చినట్లు నిమ్మల కిష్టప్ప ఆంధ్రజ్యోతికి తెలిపారు. చంద్రబాబును కలిసిన వారిలో నిమ్మల తనయుడు నిమ్మల అంబరీష్ ఉన్నారు.

చీనీకాయలు టన్ను రూ.37 వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 10: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.37 వేలు, కనిష్ఠంగా రూ.14 వేలు, సరాసరి రూ.20 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 122 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

15న మహిళలకు ప్రత్యేకంగా ఉద్యోగమేళా

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 10: మొబైల్, ఎలక్ర్టానిక్ తయారీ సంస్థలో ఖాళీల భర్తీ కోసం మహిళలకు ఈనెల 15న కళ్యాణదుర్గం పట్టణంలోని పాత ఆర్డీటీ ఆసుపత్రిలోని ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. 18-26 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, పదోతరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన మహిళలు అర్హులన్నారు. ఎంపికైన వారు కోలార్‌లోని మొబైల్ సంస్థలో నెలకు రూ.20వేలు వేతనంతో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న మహిళలు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉద్యోగమేళాకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9513822234 నంబరులో సంప్రదించాలని కోరారు.

మద్యం బ్లాక్..!



ముదిగుబ్బలో మూసివేసిన మద్యం దుకాణం

పరిమితి విధించిన ఎన్నికల కమిషన్

స్టాక్ రాగానే పక్కదారి పట్టిస్తున్న సిబ్బంది

అధికార పార్టీవారి బెల్టుషాపులకు తరలింపు

బ్లాక్‌లో అధిక ధరలకు భారీగా విక్రయాలు

అనంతపురం అర్బన్/శింగనమల, ఏప్రిల్ 10: మద్యం అమ్మకాలపై ఎన్నికల కమిషన్ విధించిన పరిమితిని కూడా అధికార పార్టీ నాయకులు తమకు అనుకూలంగా వాడుకుంటున్నారు. ఉన్న స్టాక్‌ను కొందరు కొనుగోలు చేసి బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో.. గత ఏడాది మద్యం విక్రయాలపై అదనంగా 30 శాతానికి మించి అమ్మకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. అమ్మకాలు పరిమితి దాటితే ఖచ్చితమైన వివరణ ఇవ్వాలని షరతు పెట్టింది. ఈ నిబంధనలను కొందరు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. రోజువారీ టార్గెట్ పూర్తి అయ్యిందని చెబుతూ.. జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల మధ్యాహ్నం లోపలే దుకాణాలను కట్టేస్తున్నారు. ఆ తరువాత మందు బ్లాక్‌లో దొరుకుతోంది. ఈ దందాకు ఎక్సైజ్ శాఖకు చెందిన కొందరు సహకరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అధికార పార్టీ నాయకులకు అడిగినం మద్యం ఇస్తున్నారు. మద్యం బాటిళ్ల బాక్సులను వారికోసం రహస్యంగా తరలిస్తున్నారని సమాచారం. ఈ పరిణామాలు మద్యం ప్రియుల జేబులకు చిల్లులు పెడుతున్నాయి. తప్పని పరిస్థితుల్లో బార్ అండ్ రెస్టారెంట్లకు క్వార్టర్ బాటిల్‌పై అదనంగా రూ.70 నుంచి రూ.100 చెల్లించి మద్యం సేవిస్తున్నారు. బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు తీసుకుంటామని అనంతపురం ఐఎంఎల్ డిపో మేనేజర్ రాంబాబు హెచ్చరించారు.

వైసీపీ స్టోరేజీ..?

అధికార పార్టీ నాయకులు శింగనమల నియోజకవర్గంలో మద్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. మద్యం అమ్మకాలపై పరిమితి నేపథ్యంలో ఎన్నికలకు కావాల్సిన మద్యాన్ని కొని దాచిపెడుతున్నారని సమాచారం. ఉదయం కాసేపు అమ్మి.. ఆ తరువాత మద్యం దుకాణాలను కట్టేయడంతో మందుబాబులు బయట క్వార్టర్ బాటిల్‌పై రూ.50 అదనంగా చెల్లించి కొంటున్నారు. శింగనమల మండలంలో గత 10 రోజులుగా ఈ తంతు సాగుతోంది. నియోజకవర్గంలో శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల మండలాల్లో 12 మద్యం దుకాణలను ప్రభుత్వం



అనంతలో మద్యం దుకాణం వద్ద రద్దీ

నడుపుతోంది. వీటిలో రోజుకు 4,273 లీటర్ల అమ్మాలని టార్గాట్ ఇచ్చారు. అయితే చాలా మద్యం దుకాణలో పనిచేసే వ్యక్తులు వైసీపీ సానుభూతి పరులు కావడంతో తమ పార్టీ కోసం మద్యం బాటిళ్లను పక్కదారి పట్టిస్తున్నారు. శింగనమల మండలంలో మూడు దుకాణలలో రోజుకు 1,075 లీటర్లు మాత్రమే అమ్మేందుకు అనుమతి ఇచ్చారు. దీంతో రోజూ ఉదయం స్టాక్ రాగానే మొదట వైసీపీ వర్గీయులు నిర్వహించే బెల్ట్ షాపులకు ఒక బాటిల్ మీద రూ.10 అదనంగా తీసుకుని అమ్ముతున్నారు. ఆ తరువాత వైసీపీ నాయకులు చెప్పిన వారికి కొన్ని కేసుల మద్యం ఇస్తున్నారు. రోజువారీ కొనుగోలు చేసేవారికి రోజుకు గంట నుంచి రెండు గంటలు మాత్రమే అమ్ముతున్నారు. ఆ తరువాత పరిమితి ముగిసిందని దుకాణలను మూసివేస్తున్నారు.

నిఘా ఎక్కడ..?

రోజువారీ విక్రయాలపై పరిమితి విధించి.. సెబ్ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో నిఘా ఏమాత్రం లేకపోవడంతో మద్యం అధికార పార్టీవారి ఇళ్లకు వెళుతోంది. మద్యం దుకాణాల నుంచి 70 శాతానికి పైగా బెల్ట్ షాపులకు, వైసీపీ నాయకులకు అమ్ముతున్నారు. సెబ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది.

మందుబాబులకు తంటాలు

- కూడేరు మండలంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన రోజు నుంచి మద్యం దుకాణాలను సాయంత్రానికే బంద్ చేస్తున్నారు. దీంతో మందుబాబులు షాపుల వద్ద ఆందోళనకు దిగుతున్నారు. కూడేరు మండలంలో రెండు మద్యం షాపులు ఉన్నాయి. రెండింటిలోనూ మద్యం కొరత ఏర్పడుతోంది. దీంతో దుకాణాల వద్ద మద్యం కోసం పలువురు క్యూ కడుతున్నారు.
- కణేకల్లు మండలంలో మద్యం దుకాణాలు సాయంత్రానికే మూతపడుతున్నాయి. వారంరోజుల నుంచి ఇదే పరిస్థితి అని మద్యం ప్రియులు వాపోతున్నారు. సాధారణంగా పనులు ముగించుకుని.. సాయంత్రం వేళల్లో మద్యం దుకాణాలకు వెళుతుంటారు. అలాంటివారిని మూసిన తలుపులు వెక్కిరిస్తున్నాయి. పరిమితి ముగిసిందని సాకు చెప్పి సిబ్బంది వెళ్లిపోతున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాలలో మద్యం విక్రయాలపై పరిమితి విధించామని సెబ్ సీఐ కిషోర్ తెలిపారు. పరిమితి మధ్యాహ్నానికే దాటితే దుకాణాలను బంద్ చేస్తున్నారని తెలిపారు.
- ధర్మవరం నియోజకవర్గంలో రాత్రి ఏడు గంటలకల్లా మద్యం దుకాణాలను మూసేస్తున్నారు. కొన్ని మండలాల్లో సాయంత్రం 5 గంటలకే మూసేస్తున్నారు. కొత్తచెరువులో రెండు మద్యం దుకాణాలను బుధవారం రాత్రి 7గంటలకే బంద్ చేశారు. విషయం తెలియక మద్యం ప్రియులు అక్కడ భారీగా గుమిగూడారు. ధర్మవరం పట్టణంలోని కదిరిగేటు వద్ద మద్యం దుకాణాన్ని మధ్యాహ్నం 2 గంటలకే మూసేశారు. మిగిలిన మద్యం దుకాణాలు 5 గంటలకు బంద్‌చేశారు. బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాల్లో 5 గంటలకే మద్యం దుకాణాలను బంద్‌చేశారు.
- గుంతకల్లు పట్టణంలో మద్యం విక్రయాలు బ్లాక్ మార్కెట్‌లో సాగుతున్నాయి. దుకాణాలలో స్టాక్‌ను బ్లాక్ మార్కెట్‌కు తరలించి.. అధిక ధరలకు అమ్ముతున్నారు. ఎన్నికల వేళ మద్యానికి డిమాండ్ పెరిగిపోగా.. షాపుల్లో మద్యం దొరకడం గగనమైంది. బ్లాక్‌లో క్వార్టరుపై రూ.50 నుంచి రూ.80 అదనంగా వసూలు చేస్తున్నారు. డిమాండ్ ఉండే బ్రాండ్లను ఎక్కువగా బ్లాక్‌లో అమ్ముతున్నారు. బార్ అండ్ రెస్టారెంట్‌లో బ్రాండ్‌ను బట్టి రూ.80 నుంచి రూ.120 దాకా ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. రూ.100 రేంజ్‌లో ఉన్న మద్యం బాటిళ్లను దుకాణాల్లో ఎక్కడా అమ్మడంలేదు. ఆ మందంతా గ్రామలకు తరలిపోతోంది. రూ.30 నుంచి రూ.50 వరకూ అధిక ధరలకు పల్లెల్లో అమ్ముడౌతోంది. ద్విచక్రవాహనంలో పట్టణానికి వచ్చి కొనేకంటే.. గ్రామంలో బ్లాక్ లభించే మద్యాన్ని కొనడమే మేలని మద్యంప్రియులు అక్కడే కొంటున్నారు.

నిర్వాహకుల చేతివాటం..?

గార్లదిన్నె మండలంలో ప్రభుత్వ దుకాణాల్లోని మద్యం పక్కదారి పడుతోంది. మద్యం షాపులను మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 లోపల మూసివేస్తున్నారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. క్వార్టర్ బాటిల్ మద్యాన్ని రూ.50 నుంచి రూ.90 అధిక ధరలకు బ్లాక్‌లో అమ్ముతున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

గుత్తి సమీపంలో బైకును ఢీకొన్న కారు

అన్నదమ్ముల మృత్యువాత

పరిగి మండలంలో ఎదురెదురుగా ఢీకొన్న బైక్‌లు

ఇద్దరి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు

గుత్తి రూరల్/హిందూపురం, ఏప్రిల్ 10: ఉమ్మడి జిల్లాలో బుధవారం రెండు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాలలో నలుగురు మృతిచెందారు. అనంతపురం జిల్లా గుత్తి మండలంలో బైక్‌ను కారు ఢీకొని ఇద్దరు, శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలంలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని మరో ఇద్దరు మృత్యువాత పడ్డారు.



చంద్రశేఖర్‌రెడ్డి, శివానందరెడ్డి (ఫైల్)

అన్నదమ్ములు..

గుత్తి మండలం ఎంగిలిబండ గ్రామ శివారులో 67వ నంబరు జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తాడిపత్రి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి, ఉమామహేశ్వరమ్మ దంపతుల కుమారులు చంద్రశేఖర్ రెడ్డి(26), శివనందారెడ్డి (24) మృత్యువాత పడ్డారు. గుత్తి పట్టణంలో స్నేహితుడు నిర్వహిస్తున్న దేవరలో పాల్గొనేందుకు అన్నదమ్ములిద్దరూ బైక్‌పై వచ్చారు. కార్యక్రమం ముగిసిన అనంతరం స్వగ్రామానికి బయలుదేరారు. ఎంగిలిబండ గ్రామ సమీపంలో వీరి బైక్‌ను రాంగ్ రూట్‌లో ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరినీ స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.



గుత్తి మండలంలో ప్రమాదానికి గురైన బైకు

కన్నీరుమున్నీరైన తండ్రి..

ప్రమాదం గురించి తెలియగానే సుబ్బారెడ్డి వెంటనే గుత్తికి చేరుకున్నారు. చేతికొచ్చిన కొడులిద్దరూ మృత్యువాత పడటంతో బోరున విలపించాడు. పెద్ద కుమారుడు చంద్రశేఖర్ రెడ్డి తన తండ్రికి వ్యవసాయ పనులలో చేదోడుగా ఉండేవాడు. చిన్న కుమారుడు శివనందారెడ్డి ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. ఇటీవలే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రావడంతో తమ కష్టాలు తీరుతాయని ఆ కుటుంబం భావించింది. పెద్ద కుమారుడికి వివాహం చేసే ప్రయత్నాల్లో ఉండగా.. ఈ ఘోరం జరిగింది. ఎక్కడికి వెళ్లినా అన్నదమ్ములు కలిసే వెళ్లేవారని, చివరకు కలిసే చనిపోయారని తండ్రి సుబ్బారెడ్డి కన్నీరుమున్నీరయ్యారు.

ప్రాణాలు తీసిన వేగం

పరిగి మండలం చెర్లోపల్లి క్రాస్ వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు మృత్యువాత పడ్డారు. మృతులను పరిగి మండలం పెద్ద రెడ్డిపల్లికి చెందిన వాల్మీకి అంజినమూర్తి(32), కర్ణాటకలోని తిరియారుకు చెందిన శివకుమార్(36)గా గుర్తించారు. అంజినమూర్తి తన పిన్ని రామాంజినమ్మతో కలిసి మధుగిరి నుంచి స్వగ్రామానికి వస్తుండగా, వీరికి ఎదురుగా మరో బైక్‌పై శివకుమార్ వచ్చాడు. చెర్లోపల్లి గేటువద్ద వేగంగా వస్తున్న రెండు వాహనాలు అదుపుతప్పి ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. అంజినమూర్తిని హిందూపురం ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. రామాంజినమ్మ హిందూపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శివకుమార్‌ను కర్ణాటకలోని మధుగిరి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతివేగమే ప్రమాదానికి కారణమని పరిగి ఎస్‌ఐ జయలత తెలిపారు. అంజినమూర్తి భార్య నాలుగు నెలల గర్భిణి. శివకుమార్‌కు భార్య ఐదుగురు కూతుళ్లు ఉన్నారు.



అంజినమూర్తి, శివకుమార్ (ఫైల్)



చెర్లోపల్లి క్రాస్ వద్ద ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ద్విచక్రవాహనాలు

నడవలేని వృద్ధులు, దివ్యాంగులకు

ఇంటి వద్దకే బ్యాలెట్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 10: నడవలేని వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే బ్యాలెట్ అవకాశానికి ఎన్నికల కమిషన్ శ్రీకారం చుట్టింది. ఇంటినుంచే ఓటు వేయడానికి అర్హులైన వారు తమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వద్ద ముందుగానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అధికారులు స్వయంగా వచ్చి పరిశీలించి సమాచారం వాస్తవమైతే ఇంటి వద్ద ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తారు. జిల్లా వ్యాప్తంగా దివ్యాంగులు 26,107మంది, 80 ఏళ్ల పైబడిన వృద్ధులు 25,175 మంది ఉన్నారు. ఇందులో నడవలేని, పోలింగ్‌బూత్‌కు వెళ్లి ఓటు వేయలేని దివ్యాంగులకు, వృద్ధులకు మాత్రమే ఇంటి వద్దకే బ్యాలెట్ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు 9799 మంది ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వారు ఓటుకు దరఖాస్తు చేసుకుంటే ముందుగా పోలింగ్‌బూత్ స్థాయి అధికారులు ఫారం-12 అందిస్తారు. దానిని పూరించి ఇస్తే బీఎల్‌ఓలు తీసికెళ్లి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఇస్తారు. ఈనెల 22వరకు ఓటుకు దరకాస్తుకు అవకాశం కల్పించారు. దివ్యాంగులకు ఎపిక్‌కార్డు, ధృవీకరణ పత్రం, వృద్ధులకు ఓటరు జాబితాలోని వయసును పరిగణలోకి తీసుకుంటారు.



రహస్యంగానే ఓటింగ్...

నడవలేని దివ్యాంగులు, 85ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇంటివద్దనే ఓటు వేయడానికి అవకాశం కల్పించినా ఓటు మాత్రం రహస్య పద్ధతిలోనే వేయాల్సి ఉంటుంది. ఓటరు ముందుగానే పలానా రోజు ఓటు వేస్తానని అధికారులకు సమాచారం ఇస్తారు. ఆ రోజున ఓటరు ఇంటికి నియోజకవర్గ ఎన్నికల నోడల్ అధికారి, మండలస్థాయిలో డిప్యూటీ తహసీల్దార్, పోలీసులు, వీడియోగ్రాఫర్‌ను తీసుకొని ఆ ఓటరు ఇంటికి వెళతారు. అందరి పర్యవేక్షణలో రహస్య విధానంలో బ్యాలెట్‌పై ఓటు వేసేలా చర్యలు తీసుకుంటారు. ఆ ఓట్లను తొలుత తహసీల్దార్ కార్యాలయానికి, అక్కడ నుంచి ఆర్‌ఓ కార్యాలయానికి తరలిస్తారు. ఇలా సేకరించిన ఓట్లను ఓట్లు లెక్కింపు చేపడుతున్న కేంద్రాలకు చేరుస్తారు.

కళ్యాణదుర్గంలో బీన్యూ మొబైల్ షోరూమ్ ప్రారంభం

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 10: పట్టణంలోని టీ సర్కిల్‌లో నూతనంగా బీన్యూ మొబైల్ షోరూంను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ సీఈవో ఎర్రగుంట్ల సాయి నిఖిలేష్ మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా నూతన మోడల్స్‌ను ఆకర్షణీయమైన ఆఫర్లతో ఆన్‌లైన్ ధరలకంటే తక్కువకు అందిస్తున్నామని తెలిపారు. శ్యామ్‌సంగ్, ఐఫోన్, రెడ్‌మీ, రియల్‌మీ, వన్ ప్లస్, వీవో, ఒప్పో సిరీస్ వంటి అనేక బ్రాండ్ల మొబైల్ ఫోన్లను తక్కువ ధరలకే అందిస్తున్నట్లు వివరించారు. వీటితోపాటు మొబైళ్లకు అవసరమైన బ్రాండెడ్ యాక్సెసరీస్‌లను కూడా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని ఫీచర్లతో కూడిన ప్రముఖ బ్రాండ్ల టెలివిజన్లు ఎంఐ, హ్యుండయ్, వన్ ప్లస్ వంటి బ్రాండ్లను ప్రారంభధర రూ. 8999లతో అందుబాటులో వుంచామన్నారు. వీటితోపాటు హెచ్‌పీ, లెనోవా, ఏసర్, డెల్, ఏఎక్స్‌ఎల్ కంపెనీలకు చెందిన ల్యాప్‌టాప్‌లు ప్రారంభధర రూ. 16999లతో విక్రయిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుల సౌలభ్యం కోసం బజాజ్, టీవీఎస్ ఫైనాన్స్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు ద్వారా కొనుగోలుపై రూ. 5 వేల వరకు ఇన్‌స్టెంట్ క్యాష్‌బ్యాక్, బజాజ్ ఫైనాన్స్‌పై రూ. 6 వేల వరకు డిస్కౌంట్‌ను ప్రారంభోత్సవం సందర్భంగా కళ్యాణదుర్గం ప్రజలకు ఈ ఆఫర్‌ను ప్రత్యేకంగా ఇస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి నితీష్ తెలిపారు. జీరో డెలివరీ సదుపాయం ఉందన్నారు. పట్టణ ప్రజల సౌకర్యార్థం హెల్ప్‌లైన్ 040-48491111నెంబర్ కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు.



కళ్యాణదుర్గంలో ప్రారంభించిన బీన్యూ మొబైల్ షోరూమ్ వద్ద ఆల్ ద బెస్ట్ చెబుతున్న సంస్థ నిర్వాహకులు, సిబ్బంది

దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, ఏప్రిల్ 10: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా టెక్నికల్ ట్రైనీ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈఓ మీనాక్షి బుధవారం ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందాలనుకునే అభ్యర్థులు ఈనెల 25 వరకు ప్రభుత్వ వెబ్‌సైట్ www.bse.ap.gov.in లో దరఖాస్తు చేసుకోవాలన్నారు శిక్షణ మే 1వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు అనంతపురంలో ఉంటుందన్నారు. మే 1వ తేదీకి 18 సంవ్సరాలు నిండి, 45 సంవత్సరాలలోపు వయసు ఉన్నవారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. 10వ తరగతి పాసై టీటీసీలో లోయర్, ఎస్ఎస్‌సీ ఒకేషనల్ కోర్సు పూర్తిచేసి వుండాలన్నారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్, ఏపీ జారీచేసిన ఒకేషనల్ పాస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. స్టేట్‌బోర్డ్ ఆఫ్ టెక్నికల్ అండ్ ట్రైనింగ్‌లో జారీచేసిన సర్టిఫికెట్ ఉండాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుర్తింపు పొందిన ఐటీఐ ఇన్‌స్టిట్యూట్ జారీ చేసిన నేషనల్‌ట్రైడ్ కలిగినవారు, తెలుగు విశ్వవిద్యాలయం జారీ చేసిన కర్నాటిక్ మ్యూజిక్ (ఓకల్, వీణ, వయోలిన్)లో డిప్లొమా సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. ఏదైనా విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సర్టిఫికెట్ ఉండిన వారు అర్హులన్నారు.

గుత్తి- గుంతకల్లు ట్రాన్స్‌మిషన్ లైన్

పునరుద్ధరించాం: ట్రాన్స్‌కో

అమరావతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దెబ్బతిన్న 132కేవీ గుత్తి రిసీవింగ్ స్టేషన్ - సింగిల్ సర్క్యూట్ గుంతకల్లు లైన్ ద్వారా విద్యుత్తు పంపిణీ వ్యవస్థను పునరుద్ధరించామని ఏపీ ట్రాన్స్‌కో బుధవారంనాడు ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ లైన్ బ్రేక్‌డౌన్ అయినట్లుగా బుధవారం ఉదయం 8.20 గంటలకు గుర్తించామని వెల్లడించింది. ఈలైన్‌లో ఫీడర్ కాలిపోయినట్లుగా పెట్రోలింగ్ బృందం గుర్తించిందని ట్రాన్స్‌కో పేర్కొంది. ఫలితంగా గుంతకల్- ఉరవకొండ మధ్య 132 కేవీ లైన్ ద్వారా గృహ విద్యుత్తు సరఫరాకు విఘాతం ఏర్పడిందని వివరించింది. దీంతో.. బ్రేక్‌డౌన్ అయిన గుంతకల్లు, కేశపురం గ్రామాల్లో ప్రత్యామ్నాయ లైన్ ద్వారా విద్యుత్తును తాత్కాలికంగా అందించామని ట్రాన్స్‌కో వెల్లడించింది. మధ్యాహ్నం రెండు గంటల 44 నిమిషాలకు ఈ లైన్‌ను పునరుద్ధరించామనీ.. వ్యవసాయానికి అంతరాయ సమయం మేరకు అదనపు విద్యుత్తును సరఫరా చేశామని ట్రాన్స్‌కో ప్రకటనలో వెల్లడించింది.

వడదెబ్బతో మేకల కాపరి మృతి

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 10: మండలంలోని కెంచానపల్లి గ్రామానికి చెందిన వన్నూరుస్వామి(69) వడదెబ్బతో బుధవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వివరాల మేరకు వన్నూరప్ప మేకలు కాచుకుంటూ జీవనాన్ని గడిపేవాడు. మంగళవారం మధ్యాహ్నం అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించడంతో అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. వైద్యులు వడదెబ్బతో మృతి చెందినట్లుగా నిర్ధారించారని కుటుంబసభ్యులు తెలిపారు.

వైసీపీ అంతమే... కూటమి పంతం



జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బైకు ర్యాలీ



సమావేశంలో పాల్గొన్న టీడీపీ, జనసేన నాయకులు

జనసేన పార్టీ ఆత్మీయ సమావేశంలో కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 10: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అంతమే కూటమి పంతంగా పనిచేసి కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు శ్రీకారం చుడుదా మని జనసేన, టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. పొత్తు ధర్మాన్ని పాటిస్తూ పవన్ కళ్యాణ్ నమ్మకాన్ని నిలబెట్టేలా కూటమి అభ్యర్థుల విజయానికి శాయశక్తులా కృషి చేస్తామన్నారు. బుధవారం రాయల్ ఫంక్షన్ హాల్‌లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. అంతకుముందు నగరంలో నాయకులు, కార్యకర్తలు భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. రాయల్ ఫంక్షన్ హాల్ సమీపంలో పవన్‌కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం నాయకులు గజమాలతో టీసీ వరుణ్, అంబికా లక్ష్మినారాయణ, దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్‌ను సత్కరించారు. ఇందులో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు పొదిలి బాబు రావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జేఎల్ మురళీధర్, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్ మురళీ, బలిజ సంఘం యువజన అధ్యక్షుడు తొండపునాటి రమేష్, జనసేన పార్టీ పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పత్తి చంద్రశేఖర్, ఎస్సీ జనసంఘం వ్యవస్థాపకుడు దాసిగాని కుళ్లాయప్ప, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రప్రసాద్, జిల్లా సంయుక్త కార్యదర్శి ముప్పూరి కృష్ణ, నగర కార్యదర్శి ఇమామ్ హుస్సేన్, వీర మహిళలు జయమ్మ, నాయకులు పాల్గొన్నారు. ఆత్మీయ సమావేశంలో పలువురు ప్రముఖులు మాట్లాడారు.

కుటుంబసభ్యుల్లా చూసుకుంటాం



రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అన్నదమ్ముల్లా కలి సి కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉంది. నేను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత జనసేన నాయకులు, కార్యకర్తలను కుటుం బ సభ్యులుగా చూసుకుంటాను. ఒక్క చాన్స్ పేరుతో గద్దెనెక్కిన జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి 20 సంవత్సరాలు వెనక్కు నెట్టేశాడు.

- కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి

కూటమిని గెలిపిద్దాం...



అనంతపురం అర్బన్ నియోజకవర్గ ఎమ్మె ల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్, ఎంపీ అభ్య ర్థి అంబికా లక్ష్మీనారాయణ గెలుపు కోసం కృషి చేయాలి. గట్టిగా కష్టపడి రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిని గెలిపించాలి. పవన్‌కళ్యాణ్ రాష్ట్రం కోసం నిలబడ్డాడు. మనందరం ఆయన వెంట నిలబడి కూట మి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉంది.

- టీసీ వరుణ్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు

జగన్ రాష్ట్రాన్ని నాశనం చేశాడు



మనం చేసిన చిన్న పొరపాట్లు వల్ల జగన్ గెలిచాడు. రాష్ట్రాన్ని నాశనం చేశాడు. ఈసారి ఆ చిన్నపొరపాటు జరగకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం ఉంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో విద్యార్థులు, యువత, రైతులు ఇలా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కావున ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు శ్రీకారం చుట్టాలి.

-కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ

రాష్ట్రాభివృద్ధి కోసం తపిస్తున్న పవన్



జనసేన అధినేత రాష్ట్రా భివృద్ధి కోసం పరితపి స్తున్నాడు. ఐదేళ్ల వైసీపీ లో నాశనమైన రాష్ట్రా న్ని ఎలా చక్కబెట్టాలన్న ఆలోచనలో ఉన్నాడు. ఆ ఆలోచనలో పుట్టిందే పొత్తు. ఎన్ని కష్టాలొచ్చినా... ఎన్ని ఇబ్బందులొచ్చినా టీడీపీ, బీజేపీ లతో పొత్తు కుదిర్చాడు. తన ఆరోగ్యం బాగలేకపోయినా... రాష్ట్రం కోసం పరితపిస్తున్న గొప్ప వ్యక్తి పవన్.

-కాయగూరల లక్ష్మిపతి, జనసేన నాయకుడు

జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అధోగతే



వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర రావణకాష్టంగా మారింది. మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తే రాష్ట్ర అధోగతి పాలవుతుంది. కావున ప్రతిఒక్కరూ ఆలోచించి ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలి. నూతన ప్రభుత్వాన్ని శ్రీకారం చుట్టాలి. చంద్రబాబు నాయుడు సీఎం అయితేనే రాష్ట్రం, ప్రజలు బాగుపడుతారు.

-గౌసేమోద్దీన్, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్

ఉపాధి పనులను పరిశీలించిన కలెక్టర్

రాప్తాడు, ఏప్రిల్ 10: రాప్తాడు, ప్రసన్నాయపల్లి పంచాయతీ పరిధిలోని పండమేరు వంకలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను కలెక్టర్ వినోద్‌కుమార్ బుధవారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ... ఉపాధి పనులపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పనులకు ఎక్కువ మంది కూలీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పనులు చేసే ప్రాంతంలో సౌకర్యాల కల్పన, పని వేళలు తదితర వాటిపై ఆయన కూలీలతో మాట్లాడారు. రెండు నెలల నుంచి కూలీల డబ్బులు రాలేదని, కూలీ డబ్బులు ఇప్పించాలని కూలీలు కలెక్టర్‌ను కోరారు. రాప్తాడు బీసీ కాలనీలో, ప్రసన్నాయపల్లి పంచాయితీలో తాగు నీరు సక్రమంగా రాడవడం లేదని తెలిపారు. త్వరగా ఈ సమసప్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. కూలీలందరికీ ఓటు హక్కు ఉందా అని కలెక్టర్ ఆరా తీశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైందని, ఈనెల 14 వరకూ ఓటు నమోదుకు అవకాశం ఉందని అన్నారు. చిరునామా మార్పుకు కూడా అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, ఏపీడీ అనురాధ, ఈఓఆర్డి నరసింహారెడ్డి, ఏఓ రత్నాబాయి, ఏపీఓ ఓబన్న, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ముగిసిన బ్రహ్మోత్సవాలు

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 10: మండలంలోని ఒంటికొండ గ్రామంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న అక్కదేవతల బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఆఖరి రోజైన బుధవారం భక్తులు భక్తిశ్రద్ధలతో కుంకాలు కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానికులే కాకుండా చుట్టుప్రక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కుంకాలు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ముస్లింలకు వైకుంఠం ఇఫ్తార్ విందు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 10: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి బుధవారం అనంతపురంలోని తన నివాసంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. అంతకు ముందు వారితో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింల కోసం టీడీపీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందని వైకుంఠం అన్నారు. సెక్యూలర్ భావాలను తప్పని సరిగా కాపాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, నాయకులు సాలార్ బాషా, డిష్కో బాబు, ముక్తియార్, గోపాల్ గౌడ్, మార్కెట్ మహేష్, గుర్రం నాగభూషణం, గౌస్‌పీరా, ముస్లింలు పాల్గొన్నారు.



ప్రార్థన చేస్తున్న వైకుంఠం, ముస్లింలు

వలసలతో వైసీపీ ఖాళీ: పరిటాల సునీత



పరిటాల సునీత సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

రామగిరి, ఏప్రిల్ 10: నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్న వారి సంఖ్య పెరుగుతోందని, దీంతో వైసీపీ ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొందని మాజీ మంత్రి పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. వెంకటాపురంలో పరిటాల స్వగృహంలో కనగానపల్లి మండలం నెమలివారిపల్లి నుంచి కురుబ కులానికి చెందిన ఏడు కుటుంబాలు సమక్షంలో టీడీపీలోకి చేరాయి. ఈ సందర్భంగా పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ... కనగానపల్లి మండలంలో అన్ని గ్రామాలలో వైసీపీ నాయకులు టీడీపీ వైపే చూస్తున్నారన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ... తాము శక్తివంచన లేకుండా టీడీపీ గెలిచేలా కృషి చేస్తామన్నారు.

కలిసి పనిచేద్దాం.. కూటమిని గెలిపిద్దాం

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 10: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిని గెలుపించేలా కలిసి పనిచేద్దామని కూటమి అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ బీజేపీ శ్రేణులను కోరారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో కూటమి కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషిచేయాల్సిన అవసరముం దన్నారు. అర్బన్‌లోని ప్రతివార్డులోనూ వివిధ రంగాలకు చెందిన ప్రముఖులున్నారని, వారందరినీ కలిసి ఓటును అభ్యర్థించాలని అన్నారు. ఐదేళ్లుగా నష్టపోయిన సంక్షేమాన్ని, అభివృద్ధిని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను ప్రజలకు వివరిం చాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంది రెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కిరణ్ గౌడ్, నాయకులు లలిత్‌కుమార్, అశోక్‌రెడ్డి, శ్రీధర్ చౌదరి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి

అనంతపురంరూరల్ : మండలంలోని నారాయణపురం ఎంపీటీసీ-3 మహబూబ్ జాన్, తన భర్త హాజీవలితో పాటు 100 కుటుంబాలు టీడీపీలోకి చేరారు. బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్ క్యాంపు కార్యాలయంలో వారు పార్టీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రాయల్ మురళి, అనంతబాబు, రమణ పాల్గొన్నారు.

దగ్గుబాటి సతీమణి ప్రచారం

అనతపురం అర్బన్ : దగ్గుబాటి ప్రసాద్ సతీమణి శ్రీలక్ష్మి బుధవారం స్థానిక 36వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ రాజారావు, ప్రవీణ్, సుధాకర్, శ్రీ లత, అనిత, సులోచనమ్మ పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు

దగ్గుబాటి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం రాత్రి నగరంలోని ఆరో రోడ్డులోని మసీదులో టీడీపీ నాయకులు ఓంకార్‌రెడ్డి నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గౌస్‌మొద్దీన్ పాల్గొన్నారు.

కార్మికులకు అందని వేతనాలు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 10: మూడు నెలలుగా వేతనాలు అందక మున్సిపల్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉగాది పండుగ సమయంలో కార్మికులు వేతనాల సమస్యపై నిరసన వ్యక్తం చేశారు. దీంతో మళ్లీ కార్మికులు నిరసన చేపట్టకుండా ఉండటానికి మున్సిపల్ అధికారులు పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. ఈ క్రమంలో టూటౌన్ సీఐ క్రాంతికుమార్ కార్మిక నాయకులు నాగభూషణం, నాగరాజులతో మాట్లాడారు. అనంతరం కమిషనర్ మేఘస్వరూప్‌తో మాట్లాడటానికి ప్రయత్నిస్తే... ఆయన ఎన్నికల విధుల్లో ఉన్నానని చెప్పడంతో అడిషనల్ కమిషనర్ శ్రీహరిబాబుతో కార్మిక నాయకులు, సీఐ చర్చలు జరిపారు. ఉన్నతాధికారులు చెప్పినా కిందిస్థాయి అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే తమకు వేతనాలు పడలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంత కాలం కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా ఉంటారని నాయకులు ప్రశ్నించారు. అనంతరం కమిషనర్ స్పందించారు. కార్మికుల ఖాతాల్లోకి వేతనాలు పడేలా అధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. కాగా, కొవిడ్, గార్బేజ్, క్లాప్, మలేరియా కార్మికులకు వేతనాలు పడాల్సి ఉంది.

నైపుణ్య శిక్షణ, ఉపాధి

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 10: నిరుద్యోగ యువతకు అత్యుత్తమమైన నాణ్యమైన నైపుణ్య శిక్ష ణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఏఎఫ్ ఎకాలజీసెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. శిక్షణలో బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, కంప్యూటర్ టైపింగ్, బేసిక్ ట్యాలీ, లైఫ్ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్, బేసిక్ స్పోకెన్ ఇంగ్లీష్, కస్టమర్ రిలేషన్ షిప్ స్కిల్స్ ప్రాజెక్ట్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. మే 5 నుంచి 60 రోజుల పాటు సాగే శిక్షణలో మధ్యాహ్న భోజన వసతి, శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందజేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. 20-35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన యువతీ, యువకులు ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ చదివి ఉండాలన్నారు. వివరాలకు 73969 50345, 77807 52418లను సంప్రదించాలని కోరారు.

ఉచిత శిక్షణ

అనంతపురం విద్య, ఏప్రిల్ 10 : ఎంసెట్, నీట్, జేఈఈ తదితర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ఓబిరెడ్డి, గజలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 15 నుంచి 30 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఉదయం 9 గంటల నుంచి 2 గంటలకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ రెండు బ్యాచ్‌లుగా శిక్షణ అందిస్తామన్నారు. నిపుణులైన అధ్యాపకులతో శిక్షణ ఇస్తామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు కమలానగర్‌లోని తమ సంస్థలో కానీ, 90597 23829, 75690 33379 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ముస్లింలకు సన్మానం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 10: రంజాన్ మాసం చిట్టచివరి ఎతీకాఫ్ (నిత్య ప్రార్థన)లో పాల్గొన్న పలువురు ముస్లింలను బుధవారం ఐఎంఎం ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు మహబూబ్ బాషా జామియా మసీదులో సత్కరించారు. మహబూబ్ బాషా మాట్లాడుతూ... రంజాన్ మాసంలో ఎంతో భక్తి శ్రద్ధలతో కఠోర దీక్షలు చేయడమంటే పాపాలను తొలగించుకోవడమేనన్నారు. చివరి పదిరోజులు ఎతీకాఫ్‌లో ఉండటం చాలా సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఏపీ హెల్పింగ్ హ్యాండ్ అధ్యక్షుడు షబ్బీర్, నిజాం పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

రాప్తాడు, ఏప్రిల్ 10: మండలంలోని బుక్కచెర్ల గ్రామానికి చెందిన పురుషోత్తంరెడ్డి (30) అనుమానాస్పద స్థితిలో మరణించాడు. అతను బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఇంట్లో నుంచి నల్లలమ్మ ఆలయం వద్ద ఉన్న దొడ్లోకి వెళ్లాడు. కొంతసేపు తర్వాత ఆ దొడ్లోకి వెళ్లిన కుటుంబ సభ్యుడు నల్లపరెడ్డి.. పురుషోత్తంరెడ్డి మంచంపై పడి ఉండటాన్ని గమనించాడు. వెళ్లి పరిశీలించగా... అతను చనిపోయినట్లు గుర్తించి... గ్రామస్థులకు, పోలీసులకు సమచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పురుషోత్తంరెడ్డికి ఇంకా వివాహం కాలేదు. కేసు దర్యాప్తులో ఉందని, వివరాలు తెలియాల్సి ఉందని రాప్తాడు సీఐ మునిస్వామి తెలిపారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు

శింగనమల, ఏప్రిల్ 10: మండలంలో ఈస్టునరసాపురంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. అతని నుంచి స్వాధీనం చేసుకున్న 36 మద్యం బాటిళ్లను సీజ్ చేశామని, నిందితుడ్ని కోర్టులో హాజరుపరించామని తెలిపారు.

టీడీపీతోనే ముస్లిం మైనార్టీల సంక్షేమం : బండారు శ్రావణిశ్రీ

శింగనమల, ఏప్రిల్ 10: ముస్లిం, మైనార్టీ సంక్షేమం ఒక్క టీడీపీతోనే సాధ్యమని కూటమి శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ బుధవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. ముస్లిం, మైనార్టీ సంక్షేమం, అభివృద్ధి కోసం టీడీపీ అనేక పథకాలు అమలు చేసిందన్నారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి వారిని ఆదుకున్నామన్నారు. చంద్రబాబు రంజాన్‌తోఫా, దుల్హన్ పథకాలు, మతపెద్దలకు గౌరవ వేతనం, విదేశీ విద్యాపథకాలు, కంప్యూటర్ శిక్షణ, ఉచిత కుట్టు శిక్షణ, హజ్‌యాత్రికకోసం హజ్‌హస్ కట్టించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. వైసీపీ అధికారంలోనికి వచ్చిన తరువాత ఆ సంక్షేమ పథకాలు రద్దు చేసిన జగన్‌రెడ్డి ముస్లిం, మైనార్టీల ద్రోహిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ నాయకులకు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు.

రంజాన్ తోఫా పంపిణీ

అనంతపురంరూరల్, ఏప్రిల్ 10: మండలంలోని కందుకూరులో రంజాన్ పండుగను పురస్కరించుకుని గ్రామంలోని ముస్లీం కుటుంబాలకు టీడీపీ నాయకులు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. బుధవారం టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కందిబ్యాళ్లు, నూనె, గోధుమపిండి, చక్కెర, సేమియా తదితర సరుకులను 35 కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

రాప్తాడు : రాప్తాడు గ్రామ పంచాయతీ పరిధిలోని మైనార్టీ కాలనీలో బుధవారం సాయంత్రం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ తిరుపాలు, కురుబ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ, షేక్షావలి, మోహన్‌రెడ్డి, అనిల్, మహేష్ పాల్గొన్నారు. గంగలకుంట గ్రామంలో టీడీపీ నాయకుడు బుడగ రాజు గ్రామంలోని మసీదులో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇంద్ర, రామకృష్ణ, గంగాధర్, నందకుమార్ పాల్గొన్నారు.



కందుకూరులో రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

వైభవంగా కొత్త వెంకటరమణుడి కల్యాణం



స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

యాడికి, ఏప్రిల్ 10: ఉగాది పండుగను పురస్కరించుకొని బుధవారం చింతలాయపల్లి గ్రామంలో లక్ష్మీ కొత్త వెంకటరమణస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కొత్తవెంకటరమణ స్వామి ఆలయంలో ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులకు కల్యాణం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు.

వడదెబ్బ నివారణపై అవగాహన

అనంతపురంరూరల్, ఏప్రిల్ 10: వడదెబ్బపై ప్రభుత్వ హోమియో వైద్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని స్థానిక విద్యుత్ కార్యాలయ ఆవరణంలో బుధవారం నిర్వహించారు. ప్రభుత్వ హోమియో వైద్యుడు నల్లపాటి తిరుపతి నాయుడు ఉద్యోగులు, ప్రజలకు వడదెబ్బ తగలకుండా ఉండేందుకు హోమియో మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ... ఎండలో ప్రయాణం చేసేటప్పుడు కొబ్బరి నీళ్ల, గ్లూకోస్, పండ్ల రసాలను తీసుకోవడం మంచిదన్నారు. అధిక జ్వరం, తలనొప్పి, తలతిరగడం, విపరీతమైన దాహం, నీరసం, గుండె వేగంగా కొట్టుకోవడం, కండాలు బిగుసుకుపోవడం, చర్మం ఎర్రగా కందిపోవడం, పొడిగా మారటం, వాంతులు, శ్వాస వేగంగా పీల్చుకోవడం, ఫిట్స్ రావడం... వడదెబ్బ లక్షణాలని తెలిపారు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని గాలి తగిలే విధంగా చూసుకుని దగ్గర్లోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈఈ లక్ష్మీనారాయణ, సూప రింటెండెంట్ లక్ష్మీబాయి, కృష్ణప్రియ, ప్రభుత్వ హోమియో వైద్యశాల పార్మసిస్ట్ సుదర్శన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ అధికారికి వైద్యపరీక్షలు చేస్తున్న తిరుపతినాయుడు

ప్రత్యేక పూజలు

శింగనమల, ఏప్రిల్ 10: ఉగాది పండుగ మరుసటిరోజైన బుధవారం మండలంలోని అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని ఆనందరావుపేట సుంకులమ్మ, శివపురంపెద్దమ్మ, కుల్లుమడి నల్లలమ్మ, శింగనమల నల్లలమ్మ, అమ్మవారి దేవాలయాల్లో ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి... పూజలు చేశారు. భక్తులు కాయ, కర్పూరం, వడిబియ్యం సమర్పించారు.



ఆనందరావుపేట సుంకులమ్మ

విద్యుత్ అధికారుల అక్రమాలపై విచారణ

అనంతపురంరూరల్, ఏప్రిల్ 10: విద్యుత్ అధికారుల అక్రమాలకు పాల్పడుతూ... ట్రాన్స్‌ఫార్మర్ అమ్ముకున్నారం టూ ఇటీవల ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. అధికారుల అక్రమాలపై విచారణ చేపట్టారు. బోరు బావులు లేని రైతుల పేరిట వ్యవసాయ కనెక్షన్లకు దరఖాస్తు చేయించి, ట్రాన్స్‌ఫార్మర్లు.. ఇతర సామగ్రిని అమ్మేస్తున్నారు. నార్పల మండలంలో రూ.40 లక్షల విలువైన సామగ్రి పక్కదారి పట్టినట్లు సమాచారం. ఆ సొమ్ము పంపకాల్లో తేడాలు రావడంతో ఉద్యోగులు, సిబ్బంది గొడవ పడ్డారని ప్రచారం జరుగుతోంది. నార్పల మండలం గొళ్లపల్లి గ్రామంలోని ఓ రైతు పేరుతో తీసిన ట్రాన్స్‌ఫార్మర్ ను అధికారులు మరొకరికి అమ్మేశారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో ఆ తప్పును సరిదిద్దుకునే పనిలో పడ్డారు. ఏ రైతు పేరుతో ట్రాన్స్‌ఫార్మర్ డ్రా చేశారో.. అదే చోట మంగళవారం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఆ రైతు పొలంలో బోరు లేదూ.. ఏ పంటను సాగూ చేయడం లేదు. మరి ఆ పొలానికి అధికారులు ఏ విధంగా ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేశారో ఆ శాఖ అధికారులకే తెలియాలి. ఈ అక్రమాలపై విద్యుత్ విజిలెన్స్ అధికారులు బుధవారం విచారణ చేపట్టినట్లు సమాచారం.



గొళ్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

యువత ఉపాధి కల్పనకు కృషి

ఎంపీ అభ్యర్థి అంబికా, ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 10: నియోజకవర్గానికి పరిశ్రమలు తీసుకువచ్చి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేస్తామని టీడీపీ ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. బుధవారం వారు కంబదూరు మండలంలోని కదిరిదేవరపల్లి, చెర్లోపల్లి, ములకనూరు, గుద్దెళ్ల, మర్రిమాకులపల్లిలో భారీ ఎత్తున రోడ్ షో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో టీడీపీ సీనియర్ నాయకులు, మహిళలు, గ్రామస్థులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని రోడ్ షోలో అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేసిన వైసీపీ ప్రభుత్వానికి ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలన్నారు. అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ



పార్టీలో చేరిన వారితో అమిలినేని యశ్వంత్ చౌదరి



ప్రచారాన్ని చేపడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి సురేంద్రబాబు, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ

నియోజకవర్గంలో ఉపాధి అవకాశాలు లేక పక్కరాష్ట్రాలకు వలసలు వెళుతున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబునాయుడు చేతుల్లో వుందని అందుకు ప్రతి ఒక్కరు టీడీపీని ఆదరించాలని కోరారు. అంతకుముందు కళ్యాణదుర్గంలో అక్కమాంబ జాతరలో అమిలినేని సురేంద్రబాబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అక్కమాంబ దేవాలయంలో అమిలినేని సురేంద్రబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా కంబదూరు మండలం గుద్దెళ్ల గ్రామంలో రాధాస్వామి ఆశ్రమాన్ని సందర్శించి స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు. అమిలినేని సురేంద్రబాబు, రాజగోపాల్, తనయుడు యశ్వంత్ చౌదరి, చౌళం మల్లికార్జున, అవినాష్ చౌదరితో పాటు మరికొంతమంది రాధాస్వామి ఆశీస్సులను తీసుకున్నారు. కంబదూరు మండలంలో జల్లిపల్లికి చెందిన 20 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి.

టీడీపీతోనే ముస్లింల అభ్యున్నతి: కాలవ



పార్టీలో చేరిన వారితో కాలవ శ్రీనివాసులు

డీ.హీరేహాళ్, ఏప్రిల్ 10: రాష్ట్రంలో ముస్లింల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. మండలకేంద్రంలో బుధవారం ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలవ మాట్లాడుతూ తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు ముస్లింలకు రంజాన్‌తోఫా ఇతర సంక్షేమ పథకాలను అందించి వారికి అభివృద్ధికి చేయూతనిచ్చిందన్నారు. రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నాగళ్లి రాజు, పాటిల్ అజయ్ ఇతర కార్యకర్తలు, ముస్లింలు పాల్గొన్నారు.

35 కుటుంబాలు టీడీపీలో చేరిక

రాయదుర్గంరూరల్: మండలంలోని మెచ్చిరి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు 35 కుటుంబాలు మండల కన్వీనర్ కురుబ హనుమంతు ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు తన నివాసంలో వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. మెచ్చిరి గ్రామ పంచాయతీకి చెందిన వార్డు మెంబర్ మల్లికార్జున, తిప్పయ్య, వలంటర్ హనుమంతరాయుడుతో పాటు 35 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

కష్టాల విముక్తి కోసం టీడీపీకి ఓటెయ్యండి



అయ్యవారిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, ఏప్రిల్10: రాష్ట్ర ప్రజలు తమ కష్టాల నుంచి విముక్తి పొందడానికి టీడీపీకి ఓటువేసి గెలిపించాలని ఆపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం ఓటర్లను కోరారు. బుధవారం ఉదయం మండలంలోని అయ్యవారిపల్లి, ఇమాంపురం, కదిరిపల్లి గ్రామాల్లో గుమ్మనూరు జయరాం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణులను కలసి చంద్రబాబు నాయుడు వల్ల మాత్రమే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో బండారు ఆనంద్, కేసీ హరి, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, పాల మల్లికార్జున, పత్తి హిమబిందు. రాయల్ రామయ్య విజయలక్ష్మి పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని కర్నూలు రోడ్డులోని ఖాజా బందే నవాజ్ మసీదులో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం తనయుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

కూటమికే మద్దతు

పామిడి, ఏప్రిల్ 10: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమికే తమ మద్దతు ఉంటుందని ఏపీ ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల ప్రధాన కార్యదర్శి మండ్లరాజు పేర్కొన్నారు. పామిడిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్న ఎన్డీయే కూటమికే తన మద్దతు ఉంటుందన్నారు. మాదిగలు అందరూ ఎన్డీయే కూటమిని బలపరచాలని ఆయన కోరారు.

మసీదులో చోరీ

గుత్తి, ఏప్రిల్ 10: గుత్తి ఆర్ఎస్‌లోని సున్నీ రోషన్ మసీద్‌లో మంగళవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు హుండీలను పగలగొట్టి దాదాపు రూ.20వేలు అపహరించినట్లు మసీదు కమిటీ నిర్వాహకుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దుండగులు మసీదు వెనుక భాగంలో నుంచి లోపలకి చొరబడి తాళాలు వేసిన రెండు హుండీలను పగలగొట్టి అందులో ఉన్న నగదును అపహరించుకుని వెళ్లినట్లు మసీదులో ఉన్న సీసీ కెమెరాలో నమోదు అయ్యాయి. మసీదు కమిటీ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం బాటిళ్లు సీజ్

తాడిపత్రిటౌన్, ఏప్రిల్10: మండలంలోని చుక్కలూరు క్రాస్‌లో బుధవారం శ్రీరంగ అనే వ్యక్తి నుంచి 34మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని రూరల్ ఎస్ఐ సాగర్ తెలిపారు. వాహనాల తనిఖీ చేస్తుండగా యాడికికి చెందిన శ్రీరంగ అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తుండడం గుర్తించామన్నారు. వాటిని సీజ్‌చేసి నిందితుడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీని ఆదరించండి: మధు

కూడేరు, ఏప్రిల్ 10: వచ్చే సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఉరవకొండ నియోజకవర్గ అభ్యర్థి వై మధుసూదన్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం బుధవారం గొట్కూరు గ్రామం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ గెలవడం ఎంతో అవసరమన్నారు.

కన్నుల పండువగా అక్కమ్మగార్ల జాతర

కళ్యాణదుర్గం రూరల్, ఏప్రిల్ 10: కళ్యాణదుర్గం పట్టణంలో కన్నుల పండుగగా అక్కమ్మ గార్ల జాతర జరిగింది.



కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు

బుధవారం అక్కమ్మ గార్ల జాతర సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు ఉపవాస దీక్షతో ఊరేగింపుగా పానకాలు తెచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుండి భక్తాదులు వేల సంఖ్యలో తరలిరావడంతో దేవాలయం కోలాహలంగా మారింది. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గ్రూపు రాజకీయాలను సహించేది లేదు



గ్రామాల్లో నాయకులతో చర్చిస్తున్న టీడీపీ నాయకుడు రాజగోపాల్

బ్రహ్మసముద్రం, ఏప్రిల్ 10: పార్టీలో గ్రూపు రాజకీయాలను ఎంత మాత్రం సహించేది లేదని కళ్యాణదుర్గం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు బావమరిది రాజగోపాల్ పేర్కొన్నారు. మండలంలోని రాయలప్పదొడ్డి, యనకల్లు, కొత్తిండ్లు, తీటకల్లు, కుర్లగుంద గ్రామాల్లో బుధవారం ఆయన టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. రాజగోపాల్ మాట్లాడుతూ ఎన్నికలకు ఒక నెల మాత్రమే గడువు వుందని నాయకులు, కార్యకర్తలు సమష్టిగా గెలుపుకోసం కృషి చేయాలన్నారు. పార్టీ శ్రేయస్సును పక్కనపెట్టి గ్రూపు రాజకీయాలకు దిగే నాయకులు ఎవరైనా సహించేది లేదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన

తాడిపత్రిటౌన్, ఏప్రిల్10: ఓటు హక్కు వినియోగంపై పట్టణ ప్రజలకు కలెక్టర్ వినోద్‌కుమార్ బుధవారం అవగాహన కల్పించారు. పట్టణంలోని దివాకర్ ఆడిటోరియం నుంచి అశోక్ పిల్లర్, సీబీరోడ్డు మీదుగా కలెక్టర్‌తోపాటు అధికారులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రజలకు ఓటుకు ఉన్న ప్రాధాన్యం గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును నిర్భయంగా, స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి సమస్యలు ఏర్పడినా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం కడపరోడ్డులోని చెక్‌పోస్టును తనిఖీచేశారు. ఎఫ్ఎస్‌టీ బృందాలకు మరోసారి శిక్షణ ఇవ్వాలని సూచించారు. అవగాహన లేని ఎఫ్ఎస్‌టీ మెంబరు కిరణ్‌కుమార్‌రెడ్డికి నోటీసు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పట్టణ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, స్ట్రాంగ్ రూంలను కలెక్టర్ తనిఖీచేసి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. తహసీల్దార్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంను తనిఖీ చేశారు. మానిటరింగ్ పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, రిటర్నింగ్ అధికారి రాంభూపాల్‌రెడ్డి, డీఎస్పీ గంగయ్య, సిబ్బంది ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పెద్దపప్పూరు: మండలంలోని ముచ్చుకోట గ్రామంలోని పోలింగ్ స్టేషన్‌ను బుధవారం కలెక్టర్ వినోద్‌కుమార్ తనిఖీచేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఉన్న మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామ సమీపంలోని 544డి ప్రధాన రహదారి వల్ల భూములు కోల్పోయిన వారికి ఎలాంటి నష్టపరిహారం అందలేదని కలెక్టర్ దృష్టికి గ్రామస్థులు తీసుకువచ్చారు. స్పందించిన కలెక్టర్ త్వరలోనే మీ సమస్యను పరిష్కరిస్తానని హామి ఇచ్చారు. ఆయన వెంట సర్పంచు మహానంది జయమ్మ, తహసీల్దార్ రాజశేఖర్, ఎంఈఓ శ్రీదేవి, డీఎస్పీ గంగయ్య, ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, రూరల్ సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్ఐ శరత్‌చంద్ర, ఆర్ఐ చాంద్‌బాషా, వీఆర్వో రేణుక తదితరులు ఉన్నారు.

క్రికెట్ స్కోరర్‌గా ఆర్డీటీ క్రీడాకారుడి ఎంపిక



వినయ్

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 10: గతనెల 17నుంచి 21వరకు విజయనగరంలో జరిగిన స్టేట్‌ప్యానల్ స్కోరింగ్ పరీక్షలో ఆర్డీటీ క్యాంపు క్రీడాకారుడు వినయ్ మంచి మార్కులు సాధించి ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ స్కోరర్‌గా ఎంపికయ్యాడని ఆర్డీటీ ఏటీఎల్ రామాంజనేయులు బుధవారం తెలిపారు. పట్టణంలోని సుంకులమ్మపాలెంలో నివాసం ఉంటున్న భాస్కర్, జ్ఞాన సుందరమ్మ కుమారుడు వినయ్ 12సంవత్సరాల నుంచి ఆర్డీటీలో క్రికెట్ కోచింగ్ తీసుకుంటున్నాడు. గతంలో జేఎన్‌టీయూఏ తరపున యూనివర్సిటీ మ్యాచ్‌ల్లో జిల్లాస్థాయిలో ప్రాతినిధ్యం వహించాడని తెలిపారు. ప్రతిభ చూపిన వినయ్‌ను సీనియర్ కోచ్ సాదిక్‌వలి, ఆర్డీటీ క్రికెట్ కోచ్ భార్గవ్ అభినందించారు.

వర్షాలు కురవాలని గ్రామదేవతలకు బోనాలు



బోనాలను సమర్పిస్తున్న గ్రామస్థులు

కూడేరు, ఏఫ్రిల్ 10: సకాలంలో వర్షాలు బాగా కురవాలని, రైతు సంతోషంగా ఉండేలా దీవించాలంటూ అరవకూరు గ్రామంలో గ్రామ దేవతలకు బోనాలను సమర్పించారు. బుధవారం మండల పరిధిలోని అరవకూరు గ్రామంలో ఇంటింటి నుంచి బోనాలతో తరలివెళ్లారు.

కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 10: ఎన్డీఏ కూటమి గుంతకల్లు ఎమ్మెల్యే అభ్యర్థి జయరాం, అనంతపురం ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణను అఖండ మెజార్టీతో గెలిపించుకుందామని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో బుధవారం పార్టీ పట్టణ అధ్యక్షుడు వడ్డెరమేష్ అధ్యక్షతన శక్తి కేంద్ర ప్రముఖుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయ కోసం బూత్‌స్థాయిలో ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. సమావేశంలో కొలమిరామాంజినేయులు, విశ్వనాథ్, బండారు కృష్ణమూర్తి, గుర్రం సూర్యనారాయణ, విజయలక్ష్మి, జీఎం మహేష్, జేసీ వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, అశోక్‌కుమార్, సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా గెలిపించండి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 10: అనంతపురం పార్లమెంట్ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని రాయలసీమ ఉద్యమనేత తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో ప్రజలను కోరారు. ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం తన నినాదమని తనను గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రత్యేక రాయలసీమ అంశాన్ని బలంగా వినిపిస్తానని తెలిపారు. పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల ప్రజలు తనను ఆశీర్వదించాలని ఆయన ప్రజలను కోరారు.

వలంటీర్లూ... రాజీనామా చేయవద్దు

తాడిపత్రిటౌన్, ఏప్రిల్10: వలంటీర్లు రాజీనామా చేయవద్దని మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మీ ఉద్యోగాలు ఎవరికోసమే బలిచేసుకోవద్దని హితవుపలికారు. మీరందరూ ఐకమత్యంగా ఉండాలన్నారు. టీడీపీ ప్రభుత్వం రాగానే వలంటీర్లకు నెలకు రూ.10వేలు జీతం ఇస్తామని తమ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారన్నారు. తమ ప్రభుత్వంలో వలంటీర్లను అభివృద్ధి కోసం పనిచేయిస్తామే తప్ప పార్టీ కార్యక్రమాలకు ఉపయోగించుకోమని జేసీపీఆర్ స్పష్టం చేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలుగరాదు: డీఎస్పీ

పామిడి, ఏప్రిల్ 10: మండలంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని గుంతకల్లు డీఎస్పీ భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేసి శాంతిభద్రతలపై ఆరా తీశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని, సమస్యాత్మకమైన గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ట్రబుల్ మాంగర్స్‌పై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సీఐ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన వోల్వో బస్సు

పామిడి, ఏప్రిల్ 10: మండలంలోని గజరాంపల్లి గ్రామం వద్ద 44వ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున పెను ప్రమాదం తప్పింది. బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు ప్రయాణికులతో బయలుదేరింది. గజరాంపల్లి గ్రామ సమీపానికి రాగానే డ్రైవర్ అజాగ్రత్తతో బస్సు డివైడర్‌ను ఢీ కొని ఎదురుగా ఉన్న రోడ్డును దాటి పక్కన గల కాలువలో బస్సు నిలిచింది. ఎదురుగా గల రోడ్డులో ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పాటు బస్సు బోల్తా పడకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని ప్రయాణికులు, స్థానికులు పేర్కొన్నారు. ఈ ఘటనలో అశోక్‌కుమార్, మహమ్మద్ జహీర్, ఆజాద్ అలిముల్లా, శ్రీయ, సురేంద్రతో పాటు మరికొందరు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్, 108 వాహనాలలో ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.

చంద్రబాబునాయుడును సీఎం చేయడమే లక్ష్యం

● **మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు**

గుంతకల్లు, ఏప్రిల్10: పార్టీ అధినేత చంద్రబాబు నాయుడును మరలా సీఎం చేయడమే అందరి లక్ష్యం కావాలని మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు పేర్కొన్నారు. బుధవారం ఉదయం జితేంద్రగౌడు తన క్యాంపు కార్యాలయంలో టీడీపీ శ్రేణుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనను పిలిపించి మాట్లాడిందని, పార్టీని నమ్ముకుని ఉన్న కార్యకర్తలు, నాయకులకు తప్పక న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎటువంటి ఆరమరికలు లేకుండా పార్టీ గెలుపునకు కృషిచేయాలని చంద్రబాబు ఆదేశించారన్నారు. పార్టీ గుంతకల్లు అభ్యర్థి తన సహాయం అర్థించి వస్తే ఎన్నికల్లో తన వంతు సహకారాన్ని అందజేస్తానని తెలిపారు. సమావేశంలో పవన్ కుమార్ గౌడు, ధర్మతేజ్ గౌడు, అనిల్ గౌడు, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, టీ కేశప్ప, గుడిపాటి ఆంజనేయులు, పాల మల్లికార్జున, హనుమంతు, న్యాయవాది హేమాద్రి, రాయల రామయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జితేంద్రగౌడు

దుర్గం వనదాతల ఆధ్వర్యంలో పదివేల మొక్కల పంపిణీ

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 10: అక్కమాంబ జాతర సందర్భంగా దుర్గం వనదాతలు, అనంతపురం ప్రాణదాత సొసైటీ ఆధ్వర్యంలో ఉచితంగా పది వేల మొక్కలను పంపిణీ చేశారు. బుధవారం ఈ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఆర్డీవో రాణి సుష్మిత ప్రారంభించారు. అక్కమాంబ జాతరను పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వేల మంది భక్తులకు మొక్కలపై అవగాహన కల్పించి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో రాణి సుష్మిత

సుమారు పదివేల మొక్కలు పంపిణీ చేశారు. ఇంటి పరిసర ప్రాంతాల్లోను, రోడ్డుకిరువైపులా మొక్కలు నాటి వాతావరణాన్ని పాడుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ మొక్కల పంపిణీ కార్యక్రమం ప్రతి సంవత్సరం అక్కమాంబ జాతర సందర్భంగా పంపిణీ చేస్తామన్నారు. ఈ మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టిన నిర్వాహకులను ఆర్డీవో అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసారెడ్డి, ఎలుగు సురేష్ కుమార్, కంబాల తిమ్మారెడ్డి, పాటిల్ ఉదయ్‌కుమార్ రెడ్డి, చిన్న మల్లప్ప, చిత్తప్ప, తిప్పేస్వామి, సాయి కళ్యాణ్, మహేష్, ప్రకాష్ రెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రంలో సుపరిపాలన

● **ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి**



ప్రచారం నిర్వహిస్తున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

యాడికి, ఏప్రిల్10: టీడీపీతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాయలచెరువులో బుధవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సమస్యలపై స్థానికులను ఆరాతీశారు. ఆయన వెంట వేలూరు రంగయ్య, పరిమి చరణ్, నాగమునిరెడ్డి, శోభన్‌బాబు, బాబుగౌడ్, మాదాల అనిల్, శ్రీహరి, మదమంచి శివ తదితరులు ఉన్నారు.

రంగప్పకాలనీలో పర్యటన

తాడిపత్రిటౌన్: బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని రంగప్పకాలనీ, గణేష్‌నగర్ ప్రాంతాల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సైకిల్ గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో కదిరి శ్రీకాంత్‌రెడ్డి, రంగనాథ్‌రెడ్డి, పవన్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతలను కలిసిన జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిలోని బీజేపీ నాయకులను టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి బుధవారం కలిశారు. బీజేపీ రాష్ట్రలీగల్ సెల్ కన్వీనర్ పీవీప్రతాప్‌రెడ్డి, అంకాల్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శింగరిలక్ష్మీనారాయణ, తాడిపత్రి అసెంబ్లీ కన్వీనర్ రంగనాథరెడ్డి, గంగాధర్‌యాదవ్, అంజనేయులు, ఆర్ఎస్ఎస్ నాయకులు కత్తి రామచంద్రారెడ్డి తదితరుల ఇళ్లకు వెళ్లిన జేసీ అశ్మిత్‌రెడ్డి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

టీడీపీ గెలుపును కోరుకుంటున్న ప్రజలు



ఓబుళాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

డీ.హీరేహాళ్, ఏప్రిల్ 10: రాష్ట్ర ప్రజలు టీడీపీ గెలుపును కోరుకుంటున్నారని ఆ పార్టీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం వారు మండలంలోని ఓబుళాపురం గ్రామంలో సార్వత్రిక ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కాలవ భరత్, పాటిల్ అజయ్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అనుబంధ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తెగిపడిన హైటెన్షన్ వైరు

గుంతకల్లు, ఏప్రిల్10: పట్టణంలోని కసాపురం రోడ్డులో ఓ హై ఓల్టేజీ కరెంటు స్తంభం నుంచి హైటెన్షన్ వైరు తెగిపడటంతో స్థానికులు భయాందోళన చెందారు. బుధవారం ఉదయం కసాపురం రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయం వద్ద గుత్తి-గుంతకల్లు మధ్యన ఉన్న 220 కేవీ హై ఓల్టేజీ విద్యుత్ లైన్‌లో ఓ హైటెన్షన్ విద్యుత్ వైరు తెగిపడింది. ఈ వైరు కింద ఉన్న 11/33 కేవీ విద్యుత్ లైన్లపై పడ్డంతో ఆ ప్రాంతంలోని ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. అలాగే 220 కేవీ వైరు నేలను తాకగానే విద్యుత్ స్టేషన్‌లో సరఫరా ట్రిప్ అయ్యి, వైరులో కరెంటు సరఫరా ఆగిపోయింది. ఉదయం 8-40 గంటల సమయంలో వైరు పడ్డప్పుడు ఎవరూ దాని కింద లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మధ్యాహ్నం మూడున్నర వరకూ హై ఓల్టేజి లైన్, 11/33 కేవీ లైన్ల మరమ్మతులను పూర్తిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. 220 కేవీ విద్యుత్ వైరు పాతబడిపోయి తెగినట్లు సమాచారం. 220 కేవీ విద్యుత్ లైను వద్ద కాలనీలు వెలియడంతో స్థానికులు ఈ లైన్‌ను పట్టణ శివారులోకి మార్చాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

వైభవంగా కొత్త వెంకటరమణుడి కల్యాణం



కొత్త వెంకటరమణస్వామివారి కల్యాణం

యాడికి, ఏప్రిల్ 10: ఉగాది పండుగను పురస్కరించుకొని బుధవారం చింతలాయపల్లి గ్రామంలో లక్ష్మీ కొత్త వెంకటరమణస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కొత్తవెంకటరమణస్వామి ఆలయంలో ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి తాడిపత్రి, యాడికి, కమలపాడు, చింతలాయపల్లి, కుందనకోట, గుడిపాడు, నంద్యాలజిల్లా కొలుపల్లె, బూరుగల, తండా తదితర గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

వడదెబ్బ పట్ల విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలి

బొమ్మనహాళ్, ఏప్రిల్ 10: వడదెబ్బపై విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీధరఘట్ట వైద్యసిబ్బంది అన్నారు. బుధవారం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో వడదెబ్బ లక్షణాలు గురించి వివరించారు. విద్యార్థులు ఎండలో తిరగకూడదని పాఠశాల వదిలిన వెంటనే ఇంటికి చేరుకోవాలని తెలిపారు. ద్రవపదార్థాలు మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్ తాగాలని అన్నారు. తల తిరగడం, తలనొప్పి, శరీరం చల్లబడడం, వాంతులు, విరేచనాలు వడదెబ్బ లక్షణాలు ఉంటే వెంటనే అలాంటి వారిని ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి చేసిన నలుగురిపై కేసు

బెళుగుప్ప, ఏప్రిల్ 10: బెళుగుప్ప బీసీ కాలనీలో ఈ నెల 8న పాతకక్షలతో మహిళపై దాడి చేసిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ బుధవారం తెలిపారు. బాధితురాలు అనసూయమ్మ ఫిర్యాదు మేరకు విచారించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.